ప్రజాశక్తి
శుక్రవారం 29 ఆగస్టు 2025
5
శ్రీ సత్యసాయి

ఐదు స్కూళ్లకు 'ఎక్సలెన్స్' అవార్డులు

ప్రజాశక్తి-కొత్తచెరువు

జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని 'స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' అవార్డులకు శ్రీ సత్యసాయి జిల్లాలోని ఐదు పాఠశాలలను ఎంపిక చేసినట్లు డిఇఒ జి.కిష్టప్ప, జిల్లా స్పోర్ట్స్ స్కూల్ కార్యదర్శి మొరంజి యాదవ్ తెలిపారు. ఈసందర్భంగా వారు గురువారం మాట్లాడుతూ అవార్డులకు ఎంపికైన పాఠశాల గురించి వివరించారు. గత ఏడాది పాఠశాలల్లో జరిగిన గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించిన క్రీడాకారుల ప్రతిభ ఆధారంగా ఈ ఐదుపాఠశాలను 'స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' అవార్డులకు ఎంపిక చేశామని డిఇఒ కిష్టప్ప, జిల్లా స్పోర్ట్స్ స్కూల్ కార్యదర్శి మొరంజి యాదవ్ తెలిపారు. జిల్లాలోని చిగిచెర్ల, పులమతి, బుక్కపట్నం(బాలుర) జడ్పీ హైస్కూళ్లతో పాటు కొడిగెనహళ్లి ఎపిఆర్ఎస్, హిందూపురం ఎంజిఎం హైస్కూళ్లను ఎంపిక చేసినట్లు వారు వివరించారు.

వేధిస్తున్న 'నకిలీ'లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అన్నదాతకు నకిలీల బెడద తప్పడం లేదు. ప్రధానంగా పురుగు మందులు, విత్తనాల విషయంలో ఈ నకిలీలు అధికంగా ఉంటున్నాయి. ప్రధాన కంపెనీల పేరు మీదనే నకిలీవి మార్కెట్‌లోకి వస్తున్నాయి. సామాన్యులు ఏ మాత్రం గుర్తుపట్టలేని విధంగా బార్ కోడ్‌లను సైతం కాపీ కొట్టివస్తున్నాయి. వీటిని పురుగు మందుల విక్రేతలు రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల తనిఖీల్లోనూ ఇవి తేట తెల్లమైన విషయం తెలిసిందే.

బేయర్‌కు డూప్లికేట్

పురుగుల మందుల కంపెనీల్లో ప్రధానమైన వాటిల్లో బేయర్ ఒకటి, ఉద్యానవన పంటలకు ఎక్కువగా ఈ కంపెనీలే మందులనే వాడుతారు. ఈ కంపెనీకి చెందిన మందు ఒకటి డూప్లికేట్ తయారైన అనంతపురం నగరంలోని ఆర్టీసి బస్టాండ్ సమీపంలోని సంజీవరాయ పురుగుల మందుల దుకాణానికి వచ్చింది. అదే రకంగా మరో దుకాణంలోనూ ఇదే రకంగా నకిలీలు వచ్చాయి. సమాచారం అందటంతో వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. అదే రోజు యాడికి మండలంలోనూ నకిలీ విత్తనాలు, పురుగుల మందులు పట్టుబడ్డాయి. ఇలా ప్రధాన కంపెనీలవే నకిలీలుండగా, మరికొన్ని చోట్ల విత్తనాలు కూడా నకిలీవి బయటపడుతున్నాయి. వీటిని వేసి రైతులు నష్టపోతున్నారు. పంటనష్టపోయినా రైతులకు పరిహారం అందించే విషయంలో చర్యలుండటం లేదు.

ప్రధాన కంపెనీలవే నకిలీలు

వరుస తనిఖీల్లోనూ వెలుగులోకి

ఎరువుల కొరత నెలకొన్న నేపథ్యంలో జిల్లాలోని పురుగుల మందులు, ఎరువుల దుకాణాల్లో వ్యవసాయాధికారులు, విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు వరుసగా తనిఖీలు నిర్వహిస్తున్నారు ఈ తనిఖీల్లోనూ కొన్ని లోటుపాట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ-పాస్ ద్వారా ఎరువులు పంపిణీ చేసినప్పటికీ కొన్ని చోట్ల స్టాకుల్లో వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. ఇక నకిలీ, నిషేదిత పురుగు మందులు, విత్తనాలు కూడా అక్కడక్కడ బయటపడుతున్నాయి. వాటిపైనా అధికారులు చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

నకిలీలపై చర్యలు తీసుకోవాలి

ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోతుంటే మరోవైపు నకిలీ పురుగు, విత్తనాలతోనూ మరింతగా నష్టపోతున్నారు. ఇటు వంటివి జరగకుండా ఉండాలంటే సీజన్ ఆరంభంలోనే వ్యవసాయాధికారులు, విజిలెన్సు అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలి. నకిలీలు అమ్మే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలి. అదే విధంగా నకిలీలతో నష్టపోతున్న రైతులకు పరిహారం ఇప్పించాలి.

చంద్రశేఖర్‌రెడ్డి,
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

'విద్యుత్' అమరవీరుల పోరాటం చిరస్మరణీయం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

విద్యుత్ అమరవీరుల పోరాటం చిరస్మరణీయమని, బషీర్‌బాగ్ పోరాట స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సిపిఎం, సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. 2000 ఆగస్టు 28వ తేదీ బషీర్‌బాగ్‌లో జరిగిన విద్యుత్ ఉద్యమ పోరాటంలో అమరులైన కామ్రేడ్ రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని సిపిఎం, సిఐటియు కార్యాలయాల్లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం, సిఐటియు జిల్లా కార్యదర్శులు సి.రామకృష్ణ, ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలను తగ్గిం చాలని అఖిల పక్షం ఆధ్వర్యంలో ఉద్యమిస్తున్న తరుణంలో ప్రభుత్వం పోలీసులతో బాష్ప వాయువును ప్రయోగించి, గుర్రాలతో తొక్కించి కాల్పులు జరపడంతో ముగ్గురు కామ్రేడ్లు నేలకొరిగారని గుర్తు చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై పోరాటాలు చేయగా పలుమార్లు అక్రమ కేసులు బనాయించడం, జైల్లో పెట్టడం, నిర్బంధించడం లాంటివి చేసినా ఏనాడూ వెనక్కు తగ్గకుండా పోరాడిన చరిత్ర సిపిఎంకు ఉందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలపై అనుసరిస్తున్న మొండి వైఖరిని విడనాడి, పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను తొలగించేంత వరకూ పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

రైతులకు మేలు జరిగేలా చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జడ్పి.శ్రీనివాసులు, జిఎల్.నరసింహులు, లక్ష్మీనారాయణ, నాయకులు బ్యాళ్ల అంజి, పైపల్లి గంగాధర్, అంకె ముత్యాలు, సాకే వెంకటేష్, పెడపల్లి బాబా, సిద్దు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వైద్యుల పై దాడి

కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బుధవారం అర్ధరాత్రి వీరంగం
విధులు బహిష్కరించిన డాక్టర్లు, సిబ్బంది
పరామర్శించిన ఎమ్మెల్యే, ఎస్పీ

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఆపత్కాలంలో ప్రాణం పోసే వైద్యుల మీద మందు బాబులు వీరంగం సృష్టించి దాడికి పాల్పడిన ఘటన బుధవారం అర్ధరాత్రి కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చోటు చేసుకుంది. ఈఘటనకు సంబంధించి వైద్యులు తెలిపిన వివరాల మేరకు కదిరి పట్టణం కుటాగుళ్లలో రెండు వర్గాల మధ్య ఏర్పడిన వివాదంతో పలువురు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం మొదటగా ఒక వర్గం వారు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. కొద్ది సేపటికి మరో వర్గం అక్కడికి చేరుకొని ఆస్పత్రిలో మద్యం మత్తులో ఇరువర్గాల వారు పరస్పరం దాడులు చేసుకుని వీరంగం సృష్టించారు అంతటితో ఆగని మందుబాబులు డ్యూటీలో ఉన్న వైద్యులు, సిబ్బందిపైనా దాడులకు పాల్పడ్డారు. దీంతో ప్రాణ భయంతో వైద్యులు, మహిళా సిబ్బంది హాస్పటల్ నుండి పరుగులు పెట్టారు. వైద్యం అందించే తమపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వైద్యులు సిబ్బంది గురువారం తమ విధులు బహిష్కరించారు. హాస్పిటల్ ముందు నిరసన వ్యక్తం చేసి తమకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది మాట్లాడుతూ ప్రాణాలకు కాపాడే తమకే రక్షణ కరువైందని అర్ధరాత్రి విధులలో ఉన్న మహిళా డాక్టర్లు సిబ్బంది పై దాడికి పాల్పడితే ఎలా అని వారు ప్రశ్నించారు. దాదాపు 15 మంది మందుబాబులు విధుల్లో ఉన్న వారిపై దాడులకు పాల్పడ్డారని మహిళా సిబ్బందిఅని చూడకుండా చేతికొచ్చిన దాంతో దాడులు చేశారని ఫర్నిచర్ ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల పట్ల దాడులు తట్టుకోలేక ఇప్పటికే ఒక డాక్టర్ రాజీనామా చేసి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తపరిచారు. ప్రభుత్వం ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఉన్నత స్థాయి అధికారుల హామీ మేరకు వైద్యులు సిబ్బంది ఆందోళనను విరమించారు.

బాధిత వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ, జేసీ, ఎమ్మెల్యే తదితరులు

వైద్య సిబ్బందిపై దాడి చేసిన వారిని శిక్షిస్తాం : ఎస్పీ

ప్రభుత్వ వైద్యులపై అర్ధరాత్రి దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని జిల్లా ఎస్పీ రత్న తెలిపారు. మందుబాబుల దాడిలో గాయపడిన వైద్యులు సిబ్బందిని జిల్లా ఎస్పీ రత్న గురువారం పరామర్శించారు. దాడి ఘటన వివరాలను వైద్యులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ ఇది మద్యం మత్తులో యువకుల మధ్య చోటుచేసుకున్న ఘటన అన్నారు. టిడిపికి చెందిన వారు దాడి చేశారని సోషియల్ మీడియాలో ప్రసారం చేయడం తగదన్నారు. ఇందులో రాజకీయాలకు ఎలాంటి తావు లేదని చెప్పారు. వైద్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గాయపడిన వైద్యుల ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదు చేశామని. నిందితులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశామని త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామని ఎస్పీ తెలిపారు.

వైద్యులకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

వైద్యులపై దాడికి పాల్పడిన వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పష్టం చేశారు. కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మందుబాబుల దాడిలో గాయపడిన వైద్యులు సిబ్బందిని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. దాడి ఘటనకు సంబంధించిన వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. టిడిపి కార్యకర్తలకు మందుబాబులతో ఎటువంటి సంబంధం లేదని వైద్యులు సిబ్బంది చెప్పారు. వైద్యులు సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిని కఠిన శిక్ష పడేలా చూస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు.

బలవంతపు భూసేకరణ తగదు

సిపిఎం జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణ
వ్యకాసం, రైతు సంఘం ఆధ్వర్యంలో భూ సంరక్షణ చట్టంపై బుక్‌లెట్ విడుదల

బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రైతుల నుంచి బలవంతంగా వ్యవసాయ భూములు లాక్కోవడం తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో గురువారం వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో భూసంరక్షణ చట్టం-2013 బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల నుంచి భూములను బలవంతంగా తీసుకుంటున్న తరుణంలో భూ సంరక్షణ చట్టం ఏం చెబుతుందనే అంశాలపై బుక్‌లెట్ విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో వివిధ రకాల అభివృద్ధి పేరుతో ఏడాదికి రెండు, మూడు పంటలు పండే సారవంతమైన భూములను సన్న, చిన్న కారు రైతుల నుంచి బలవంతంగా తీసుకుంటున్నారని, అలాంటప్పుడు మనం ఏం చేయాలో తెలుసుకోవడానికి 2013 చట్టం ఉపయోగపడుతుందన్నారు. 2012లో భూసేకరణ-నష్టపరిహారం- పునరావాసం-పునర్ ఉపాధి కల్పన చట్టం పార్లమెంట్‌లో ఆమోదించబడిందన్నారు. ఎపి, తెలంగాణ ప్రభుత్వాలు 2018లో భూ సేకరం చట్టంలో 2, 3వ అధ్యాయాలను సవరణ చేసి రైతాంగానికి తీవ్రమైన ద్రోహం చేస్తున్నాయన్నారు. ఈ చట్టంలో 13వ అధ్యాయంలో 114 సెక్షన్లు ఉన్నాయన్నారు. వీటన్నింటినీ పొందుపరచడం సాధ్యం కాదని హైకోర్టు న్యాయవాది సిహెచ్.రవికుమార్ సహకారంతో క్లుప్తీకరించి ఈ బుక్‌లెట్ ప్రచురించామన్నారు. ప్రభుత్వం భూసేకరణ కోసం మన దగ్గరికి వస్తే ఏం చేయాలి? భూ రక్షణ కోసం ఈ చట్టంలో ఉన్న ముఖ్యమైన అంశాలను మాత్రమే ఈ బుక్‌లెట్‌లో పొందుపరిమని తెలిపారు. కార్యక్రమంలో, సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాకే వెంకటేష్, ఫిరంగి ప్రవీణ్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాలపల్లి పెద్దన్న, ఎ.హరి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు కృషి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లా ఆర్థిక అభివృద్ధికి పరిశ్రమల స్థాపన ధ్యేయంగా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ టిఎస్. చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమీక్ష సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందరరేగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా కొత్త పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలని పెండింగ్లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అన్ని అనుబంధ శాఖల సమన్వయంతో పనిచేయాలని, తద్వారా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. పారిశ్రామిక పెట్టుబడులను ప్రోత్సహించి పటిష్టం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక రంగంలో కొత్తగా అడిగిడుతున్న వారికి బ్యాంకుతో సమన్వయం చేసుకొని నిరుద్యోగ యువతను ప్రోత్సహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో యువతకు పెట్టుబడులు, యూనిట్లు స్థాపనపై అవగాహన పెంచాలన్నారు. పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ర్యాంప్ పథకం ద్వారా అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు.

సులభతర వాణిజ్యానికి సత్వర సేవలు

పారిశ్రామికవేత్తలు సులభతర వాణిజ్యానికి కావలసిన సేవలను అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. వాణిజ్య సంస్కరణల యాక్షన్ ప్లాన్ (డిఆర్‌ఎపి) 2024పై కలెక్టర్ సమీక్షించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సేవలను పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్యాక్టరీల అధికారి రాధాకృష్ణ, ఎస్ ఎస్ సి బ్రాంచ్ మేనేజర్ అన్సారీ, కాలుష్య నియంత్రణ అధికారితో పాటు డిపిఒ సమత, ఉద్యానవన శాఖ డిడి చంద్రశేఖర్, కెపిఎంజి అసిస్టెంట్ మేనేజర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయాలి : జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో జాతీయ రహదారుల విస్తరణకు భూ సేకరణ సోలార్ పార్కులు ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ అభ్యంతరాలు, లీగల్ క్లియరెన్స్ ప్రక్రియలను పెండింగ్ లో లేకుండా పూర్తి చేయాలన్నారు. దేశంలో రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడు తున్నాయన్నారు. జిల్లా పరిధిలో ప్రభుత్వ ప్రైవేటు భూములను కొనుగోలు చేసి భూములు కోల్పోయిన వారికి పరిహారం కూడా ఇవ్వడం జరుగుతోందన్నారు. జాతీయ రహదారులు రైల్వే లైన్ల నిర్మాణం వాటి అభివృద్ధికి అదనంగా చేపడుతున్న భూ సేకరణ పనుల ప్రతిపాదనలు ఫైళ్లను వేగవంతం చేయాలని రెవిన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. జిల్లాలో సంబంధిత ప్రతిపాదనలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి, ధర్మవరం, ఆర్డీవోలు సువర్ణ, మహేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, జాతీయ రహదారులకు చెందిన అధికారులు, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

చిరుద్యోగులను గుర్తించడం అభినందనీయం

అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న దృశ్యం

పాంచజన్య శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న చిరు ఉగ్యోగులను ఉత్తమ ఉద్యోగులుగా గుర్తించడం అభినందనీయమని ప్రవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పాంచజన్య శ్రీనివాసులు అన్నారు. హిందూపురం మండల శాఖలోని ఎంఆర్‌సిలో విధులు నిర్వహిస్తున్న ఎం. ఐ.ఎస్. కోఆర్డినేటర్ నందిని, పిటిఐ పాండు, సిఆర్‌ఎంటి రేణుక జిల్లా స్థాయిలో సమగ్ర శిక్ష ఉత్తమ ఉద్యోగస్తులుగా ఆగస్టు15 న అవార్డు పొందారు. వీరందరిని గురువారం పట్టణంలోని భవిత కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి గంగప్ప అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రవేటు పాఠశాల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పాంచజన్య శ్రీనివాసులు, జిల్లా నాయకులు వేణుగోపాల్, రీయాజ్, ముస్తఫా ఆలీ ఖాన్ అవార్డు గ్రహీతలను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు విద్యాశాఖలో విధులు నిర్వహిస్తు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉద్యోగులుగా గుర్తింపు తెచ్చుకోవడం అభినందనీయం అన్నారు. ఉద్యోగులందరు వీరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ -2 ప్రసన్నలక్ష్మి, సిఆర్‌ఎంటిలు, పిటిఐలు, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - హిందూపురం

పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి బెంగళూరుకు చెందిన ట్రాన్స్ పోర్ట్ అధినేత కుటుంబం విరాళం అందజేసింది. బెంగళూరులో స్థిరపడ్డ రాధాకృష్ణ ట్రాన్స్ పోర్ట్ అధినేత గాయత్రి కుమారుడు రాజ్ కుశాల్, లహరి గురువారం ఆలయ నిర్మాణం కోసం రూ.4.50 లక్షలు అందజేశారు. ఆలయ నిర్మాణానికి వితరణ అందజేయడం పట్ల ఆలయ కమిటీ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు చారు కీర్తి, కౌన్సిలర్ రాఘవేంద్ర, నిమ్మకాయల రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లపై వైసిపి విషప్రచారం : మంత్రి సవిత



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి

ప్రజాశక్తి-రొద్దం

రాష్ట్రంలో ఎక్కడా అర్హుల పింఛన్లు తొలగించడం లేదని, వైసిపి నాయకులు కేవలం ఆ పార్టీని బతికించుకోడానికి వికలాంగుల పింఛన్లపై విష ప్రచారం చేస్తున్నారని మంత్రి ఎస్.సవిత తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీ కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. మండలంలోని పెదమంతూరు పంచాయతీ పరిధిలోని పి.రొప్పాల గ్రామంలో రూ. 2 కోట్ల వ్యయంతో చేపట్టిన పిహెచ్‌సి భవన నిర్మాణానికి, ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు గురువారం మంత్రి భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ పెనుకొండలో త్వరలోనే పెనుకొండలో టిడిపి కార్యాలయం, ప్రభుత్వ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. కందుకూర్లపల్లి నుంచి చిన్నకోడిపల్లి రహదారి పనులు ప్రారంభిస్తామన్నారు. రొద్దంలో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు, బీసీ కమ్యూనిటీ హాల్, అదనంగా మరో బీసీ హాస్టల్ నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, నరహరి, చంద్రమౌళి, చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి, నరసింహులు, అశ్వర్థనారాయణ, వీరాంజి, రాము, రామచంద్ర, పవన్, శ్రీనాథ్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డైరీలు పంపిణీ

మంత్రి సవిత పెదమంతూరు జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అలాగే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కూల్ డైరీలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, మీకు ఏవైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పరిగి : మండలంలోని కొడిగెనహళ్లి, పరిగి, ధనాపురం జడ్పీ హైస్కూళ్ల 8, 9, 10 తరగతుల విద్యార్థులకు మంత్రి సవిత సౌజన్యంతో టిడిపి మండల కన్వీనర్ ఎస్ఎన్.గోవిందరెడ్డి ఆధ్వర్యంలో డైరీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్‌రెడ్డి, సత్యపలిరాజ్, జ్యోతిర్మయి, నాయకులు సూర్యనారాయణ, వెంకటేష్, సంజీవరాయప్ప, లక్ష్మణరావు, డిఎస్ఎల్ శ్రీనివాసులు, కంకర శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

పెనుకొండ : నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని మంత్రి సవిత తెలిపారు. రొద్దం మండలంలోని చిన్నమంతూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, మాజీ సర్పంచి వడ్డే వెంకటేష్ కుమారుడు సాయి కళ్యాణ్ అనారోగ్యం బారిన పడగా వైద్యం కోసం రూ. 20 లక్షలు ఖర్చు అయింది. ఆ కుటుంబానికి సిఎం సహాయ నిధి నుంచి రూ. 5.32లక్షలు మంజూరు కాగా ఆ చెక్కును మంత్రి అందజేశారు. అలాగే అదనంగా మంత్రి రూ. 50 వేలు, దాతలు రమణారెడ్డి రూ. 50వేలు, ధనుంజయ నాయుడు రూ. 50వేలు, రామానాయుడు రూ. 25వేలు, మాధవ నాయుడు రూ. 25వేలు, చిన్నప్పయ్య రూ.25 వేల ఆ కుటుంబానికి అందజేశారు.

'విద్యుత్' అమరవీరుల పోరాటం చిరస్మరణీయం

ప్రజాశక్తి-కదిరిటౌన్

అదానీ కంపెనీకి లాభాలు.. ప్రజలపై భారాలు వేసేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని సిపిఎం పట్టణ కార్యదర్శి జగన్మోహన్ విమర్శించారు. వామపక్ష పార్టీల పిలుపు మేరకు సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్లో విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. అలాగే బషీర్‌బాగ్ విద్యుత్ పోరాట అమర వీరులకు నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 2000 సంవత్సరంలో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పోలీసుల కాల్పుల్లో రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి అమరులయ్యారన్నారు. ఆ ఉద్యమం ఫలితంగా సుమారు 2 దశాబ్దాల పాటు విద్యుత్ ఛార్జీలు పెంపునకు ఏ ప్రభుత్వం సాహసం చేయలేదని గుర్తు చేశారు. విద్యుత్ సంస్కరణల్లో కూటమి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిజ్ఞ దినంగా పాటించామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్మోహన్, సాంబశివ, రామ్మోహన్, బాబ్జాన్, సిఐటియు నాయకులు పవన్‌కుమార్, లియాకత్, కదిరప్ప, మదునాయక్, రైతు సంఘం నాయకులు శంకర్‌రెడ్డి, కృష్ణానాయక్, నారాయణ పాల్గొన్నారు.

ముదిగుబ్బ : స్థానిక అంబేద్కర్ సర్కిల్లో వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు తొలగించేంత వరకు పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆదో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేశు, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్జాన్, పక్కీరప్ప, నౌషాద్‌బాషా, ఆటో నాయకులు ఆదికేశవ, చాంద్‌బాషా, రిక్షా హైదరవలీ, టైలర్ ముత్యం పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : స్థానిక సుందరయ్య కాలనీలో సిపిఎం ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమ అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కన్వీనర్ కుళ్లయప్ప మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటంలో భాగంగా తృణప్రాయంగా ప్రాణాలర్పించిన మీకు మా విప్లవ జోహార్లు.. మీ త్యాగాలను వృథా కానివ్వబోమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న మోదీ, అదానీ అనుకూల విద్యుత్ సంస్కరణలను పెంచిన విద్యుత్ ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు, తదితర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు వి.వి.రమణ, కాంతమ్మ, అంజి, నరసింహులు, రెడ్డమ్మ, రామచంద్ర, సుబ్బయ్య, ఆదినారాయణ, గంగిశెట్టి, నాగప్ప, నరసమ్మ, నరసింహ, నరసింహారెడ్డి, చిట్టెమ్మ పాల్గొన్నారు.

బుక్కపట్నం : సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక గణేష్ నాయక్ స్థూపం వద్ద బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి బ్యల్ల అంజి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను తొలగించేంత వరకు పోరాటం చేస్తామని

కదిరిలో బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమ అమరవీరులకు నివాళులర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామదాసు, సుబ్రహ్మణ్యం, మోమిన్, రామంజి, గౌస్‌పీర్, సుబ్బు పాల్గొన్నారు.

కొత్తచెరువు : స్థానిక బిసి కాలనీలో సిఐటియు మండల కార్యదర్శి ముత్యాలు ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ విద్యుత్ అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముత్యాలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల విధానానికి స్వస్తి పలకాలన్నారు. లేనిచో బషీర్‌బాగ్ అమరుల స్ఫూర్తితో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు ప్రాంతీయ కార్యదర్శి బాళ్ల అంజి, శ్రావణి, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ



ధర్మవరంలో బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమ అమరవీరుల నివాళులర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

మండల నాయకులు మాబు ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు లక్ష్మీనారాయణ, హనుమయ్య, కొండా వెంకటేశులు, వెంకటేశులు, కెవిపిఎస్ వెంకటేశులు, రామకృష్ణ, రవి, నాగరాజు, బెస్త కిష్టప్ప, కుమ్మరి కిష్టప్ప, శ్రీనివాసులు, రామాంజనేయులు, గోవిందప్ప, చేనేత కార్మిక సంఘం నాయకులు నాగరాజు, బాబావలి పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్ బాషా ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎల్.ఆదినారాయణ, హరి, నామాల నాగార్జున, ఆవుల రవి, వెంకటస్వామి, ఎంఆర్‌పిఎస్ నాయకులు సాకే లక్ష్మన్న, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : బషీర్ బాగ్ లో అమరులైన ఆశయాలను కొనసాగిద్దామని సిఐటియు పట్టణ కన్వీనర్ రాము అన్నారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో నాయకులు 2000 ఆగస్టు 28 విద్యుత్ ఉద్యమాలలో కాల్పులకు గురై అమరులైన బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి, రామకృష్ణ చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో రాబోయే రోజుల్లో విద్యుత్ భారాలపై పోరాటాలకు ప్రజలందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కో కన్వీనర్ డి రామకృష్ణ, సిఐటియు నాయకులు రామాంజి, అంజనప్ప, కొట్నూరు జిబివుల్లా, గంగాధర, సూరి, బాబు రెడ్డి, హనుమంతు, నరసప్ప, గురు ప్రసాద్, హరీష్, గోపాల్, కుమార్, మూర్తి, రవి, వలి తదితరులు పాల్గొన్నారు.



ఓబుళదేవరచెరువులో..

కొత్తచెరువులో..

ముదిగుబ్బలో..

ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్రాభివృద్ధి

మంత్రి సత్యకుమార్ యాదవ్

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధికి మార్గం ఏర్పడుతుందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి, సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మెప్మా పీడీ, సిఒ, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మవరం పట్టణంలోని 2,488 స్వయం సహాయక సంఘాల స్థితిగతులపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ మెప్మా పద్మావతి, టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ పెనుబోలు విజయభాస్కర్, సిఎంఎం లక్ష్మీనారాయణ, ఆర్పీలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం

జర్నలిస్టుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. గురువారం మంత్రి కార్యాలయంలో కలిసిన ఏపీయూడబ్ల్యూజే నాయకులతో ఆయన మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న యూనియన్ నాయకులు రాజగోపాల్ కుటుంబసభ్యులకు యూనియన్‌నాయకులు సేకరించిన రూ.25వేలను మంత్రి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జీ.వి నారాయణ, చింతకాయల పుల్లయ్య, డి.బాబు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ధర్మవరం రూరల్ : వైద్య సంబంధిత అత్యవసర పరిస్థితులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే సిఎంఆర్ఎఫ్ ముఖ్య ఉద్దేశమని మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. పట్టణంలోని ఎన్‌డిఎ కార్యాలయంలో మంత్రి 58 మంది లబ్ధిదారులకు రూ. 55 లక్షల విలువ చేసే సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. హంద్రీనీవా కాలువల ద్వారా ముదిగుబ్బ, బత్తలపల్లి మండలాల పరిధిలోని 17 చెరువులకు నీరందించే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. అంతకుముందు మంత్రి పట్టణంలోని పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జనం ఊరేగింపులో నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట నాయకులు చిలకం మధుసూదన్ రెడ్డి, సందా రాఘవ ఉన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ యాదవ్, నాయకులు ఓబులేసు, చంద్ర, భాస్కర్, రామ్మోహన్, అంజన్‌రెడ్డి, గిర్రాజు నగేష్, పోతుకుంట రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికై మంత్రికి వినతి

పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలో నిర్మాణ దశలో ఉన్న శ్రీ కోదండ రామాలయం అభివృద్ధికి సహకరించాలని ఆ కాలనీలోని 28వ వార్డు ప్రజలు మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. పూలకుంట మహేష్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి టిటిడి, దేవాదాయ శాఖ ద్వారా నిధులు మంజూరు చేయించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకోదండ రామాలయం వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గ సభ్యులు మదనాపు నరేష్‌బాబు, కొత్తపల్లి ఈశ్వరరెడ్డి, భీమనపల్లి వెంకటరాముడు, ముక్తాపురం సంజీవులు, మన్నాల శ్రీనివాసులు, కాసుల కరుణాకర్, పడిగేరి నరసింహులు, ముసుగు జయరాం, బాలగోవింద్, కృష్ణాపురం జమీర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉపాధ్యాయ కొలువులు సాధించి..

రైతు బిడ్డ రాజశేఖర్‌కు ఎస్ఎ ఇంగ్లీష్, టిజిటి ఉద్యోగాలు

తండ్రి కృష్ణయ్యతో రాజశేఖర్

ప్రజాశక్తి-కదిరి టౌన్

సాధారణ రైతు, నిరుపేద కూలీ బిడ్డలు పట్టుదలతో చదివి డీఎస్సీ-2025 ఫలితాల్లో సత్తా చాటి పలువురికి ఆదర్శంగా నిలిచారు. కదిరి రూరల్ మండలం వీరేపల్లిపేట గ్రామానికి చెందిన రైతు కృష్ణయ్య రెండో కుమారుడు రాజశేఖర్ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్‌లో 82.5 మార్కులతో జిల్లా స్థాయిలో 5వ ర్యాంకు సాధించాడు. ఓపెన్ క్యాటగిరీలోనే ఉద్యోగం పొందారు. ఈయన టిజిటి ఉద్యోగం కూడా సాధించారు. కృష్ణయ్య పెద్ద కుమారుడు భాస్కర్ డీఎస్సీ-2014లో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించి ఇంగ్లీష్ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. ఇద్దరు కుమారులు ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువులు సాధించడంతో ఆ తల్లిదండ్రులు ఆనందంతో ఉప్పొంగిపోయారు.

వ్యవసాయ కూలీ బిడ్డ ఉపాధ్యాయునిగా..

సోమందేపల్లి : మండలంలోని తుంగోడు పంచాయతీ పరిధిలోని కూగాటిమానిపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు నీరగంటి రామాంజనమ్మ, చిన్న నరసింహప్పల ఏకైక కుమారుడు నీరగంటి బాబు 18వ ర్యాంకు సాధించి ఎస్‌టిజి ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. టిటిసిలో మంచి ర్యాంకు సాధించి బుక్కపట్నం ప్రభుత్వ కాలేజీలో టిటిసి పూర్తి చేశారు. 2018 డీఎస్సీలో విఫలమైనా పట్టుదలతో చదివి ఇప్పుడు ఉద్యోగం సాధించాడు. మిత్రులు శివరాజ్, మాధవీలత, విశ్వనాథ్ చేయూతనందించారని బాబు కృతజ్ఞతలు తెలిపారు. బాబును తుంగోడు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మూర్తి, గ్రామస్తులు, మిత్రులు అభినందించారు.

నీరగంటి బాబు

సిఐటియు జిల్లా మహాసభలు వాయిదా

జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఈ నెల 30, 31 తేదీల్లో పెనుకొండ పట్టణంలో నిర్వహించతలపెట్టిన జిల్లా సిఐటియు 10వ మహాసభలను అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు జడ్పీ శ్రీనివాసులు, ఈఎస్ వెంకటేష్ తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆ తేదీల్లో రావడానికి రాష్ట్ర నాయకత్వానికి వీలు కలగక పోవడంతో ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నామని, మళ్లీ మహాసభలు ఎప్పుడు నిర్వహిస్తామనే విషయాన్ని సిఐటియు జిల్లా కమిటీ తెలుపుతుందన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిఎల్ నరసింహులు, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, పెడబల్లి బాబా, సి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

కొత్తచెరువు: ఎరువుల కొరత తీవ్రంగా ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గురువారం విజిలెన్స్ అధికారులు స్థానిక ఎరువుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ సిఐ శ్రీనివాసులు, డిసిటిఒ సురేష్ స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. గోడౌన్లలో ఉండే స్టాక్‌కు ఆన్‌లైన్‌లో స్టాక్‌కు ఎరువుల తేడాలు గమనించి మూడు షాపుల్లో రూ. 1,81,800 స్టాక్‌ను విక్రయాలను తాత్కాలికంగా నిలుపుదల చేశామన్నారు. గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచి ఎరువులు, క్రిమిసంహారక మందులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. నిబంధనల మేరకే వీటి అమ్మకాలు నిర్వహించాలన్నారు. వారి వెంట మండల వ్యవసాయ అధికారి సతీష్ బాబు, ఎఇఒ సునీత ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందాలి : డిఎంహెచ్ఒ

బత్తలపల్లి : పిహెచ్‌సిలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డిఎంహెచ్ఒ) ఫైరోజ్ బేగం సూచించారు. ఆమె గురువారం స్థానిక పిహెచ్‌సిని సందర్శించి ఫార్మసీ స్టాక్, ఓపి రిజిస్టర్, ఆన్‌లైన్‌లో ఈహెచ్ఆర్ నమోదు, ల్యాబ్‌లో రక్తపరీక్షలు, తదితర వాటిని తనిఖీ చేశారు. ఆరోగ్య కార్యక్రమాల వివరాలు, వాటి ప్రగతిపై వైద్యాధికారి అరుణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల నమోదు, వారికందించే సేవలు, వ్యాధినిరోధక టీకాల ప్రగతి, టిబి, లెప్రసీ, సీజనల్ వ్యాధుల నివారణ, తదితర వాటిపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, అన్ని ఆరోగ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించి మంచి పురోగతి సాధించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

మంత్రికి పెన్షనర్ల వినతి

ధర్మవరం రూరల్ : 'హెల్త్ ఇన్సూరెన్స్ స్కీంను బతికించండి' అని గురువారం పట్టణంలోని ఎన్‌డిఎ కార్యాలయంలో కొందరు పెన్షన్‌దారులు మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రతి నెలా ప్రభుత్వానికి హెల్త్ స్కీం ద్వారా ప్రీమియం చెల్లిస్తున్నామన్నారు. అయినా ఆయా ఆసుపత్రులకు వెళ్తే అదనంగా డబ్బులు అడుగుతున్నారని ఫిర్యాదు చేశారు. వినతి ఇచ్చిన వారిలో సత్యనిర్ధారణ, సోమశేఖర్, తదితరులు ఉన్నారు.

ఎపిటిఎఫ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-రొద్దం

ఎపిటిఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. మండలంలోని తురకలాపట్నం పాఠశాల ఆవరణలో గురువారం ఎన్నికల అధికారి కోడూరు శ్రీనివా సులు, అసిస్టెంట్ ఎన్నికల అధికారి కె.మల్లికార్జున సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎం.ఫణీంద్ర, అధ్యక్షులుగా ఎన్.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా చంద్రమౌళి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా నరసింహులు, సభ్యులుగా పవన్‌కుమార్, పి.పరమేష్, ఉపాధ్యక్షులుగా ఎం.శ్రీనివాసులు, ఎస్.రజనీకాంత్, సి.బాలాజీ, సి. రామాంజనేయులు, ఎం.సంజీవ్, మోహన్‌రెడ్డి, టి.లక్ష్మణమూర్తి, టి.సౌజన్య, జిల్లా కౌన్సిలర్లు ఎం.శ్రీనివాసులు, ఎం.గోకుల్, జె.తేజ, పి.శ్రీనివాస్ రావు, టి.లక్ష్మీనారాయణ, కె.విష్ణు, వై.నాగభూషణం, యు.వరలక్ష్మి, మండల కౌన్సిలర్లుగా జయ చంద్ర, కె..రాజశేఖర్, ఎం.బాలవెంకటేష్,డికె.వీరభద్ర, సి.మంజునాథ్, ఎస్.కుళ్లాయప్ప, యు.లలితమ్మ. యల్లప్పలను ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గ సభ్యులు

ధర్మవరంలో కొలువుదీరిన వినాయకుడు

ఘనంగా వినాయక చవితి వేడుకలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో మండపాలు ఏర్పాటు చేసి అందులో వినాయకుని ప్రతిమలను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కమ్మపాలెం, బిసి కాలనీ, వడ్డెర కాలనీ, పెనుగొండ రోడ్డు కాలనీ, ధర్మవరం రోడ్డు కాలనీ, పుట్టపర్తి రోడ్ల కాలనీల్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు. మండపాల్లో ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ తర్వాత నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు.

ధర్మవరం రూరల్ : ధర్మవరం పట్టణంలోని 24 వార్డు పార్థసారథి నగర్‌లో బుధవారం వినాయక చవితి ఉత్సవాలను స్థానిక కమిటీ సభ్యులు ఘనంగా ప్రారంభించారు. వార్డు ప్రజలు భక్తి శ్రద్ధలతో వినాయకుడికి పూజలు చేశారు, రెండో రోజు గురువారం కూడ ప్రజలందరూ ఆనందంగా వేడుకల్లో పాల్గొన్నారు, ఈ వేడుకలని ఆ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి మంజునాథ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని, కార్య నిర్వాహణ సభ్యులు కోరే గోపాల్,అక్కులప్ప, మనోహర్ పోతలయ్య తదితరులు తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-గుడిబండ

కడుపునొప్పి తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మండలంలోని కురుబరపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజకుళ్లాయప్ప తెలిపి వివరాలు.. వక్కలిగ నవీన్‌కుమార్(33) మూడు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా తగ్గకపోవడంతో బుధవారం రాత్రి మల్బరీ పంటకు ఉపయోగించే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య భవ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి హిందూపురం

హిందూపురం రూరల్ మండలం మిట్టమీద పల్లి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పట్టణంలోని సిపిఐ కాలవలిలో నివాసముంటున్న మహబూబ్ బాషా (48) తూమకుంట పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డ్ గా విధులు నిర్వహిస్తున్నాడు. విధులకు హాజరు కావడానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా బెంగళూరు వైపు నుంచి వస్తున్న వెంకటేశ్వర బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో మహబూబ్ బాషా తలకు తీవ్రమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి

వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్న ప్రజలు

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొంది. ప్రధానంగా రాళ్లపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీ, ఇందిరమ్మ కాలనీలు, కల్లురొప్పం గ్రామంలోని కమ్మరి కాలనీలో కొన్ని నెలలుగా తాగునీరు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో ఆయా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విధి లేని పరిస్థితుల్లో సమీపంలోని వ్యవసాయ బోర్లు, బావుల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక ప్రజా ప్రతినిధులు, సర్పంచి, ఇప్పటికే సచివాలయంలో పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో ఉన్న బోర్లలో నీరు లేకపోవడం, ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయకపోవడంతో మా కాలనీలకు 10 నెలలుగా తాగునీరు సక్రమంగా అందడం లేదని రాళ్లపల్లి గ్రామ ఎస్సీ, ఇందిరమ్మ కాలనీల మహిళలు మండిపడుతున్నారు. ఇకనైనా సర్పంచి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని రాళ్లపల్లి ఎస్సీ కాలనీ, ఇందిరమ్మ కాలనీలు, కొల్లురొప్పంలోని కమ్మరి కాలనీల ప్రజలు కోరుతున్నారు.

నేడు పరిటాల రవి జయంతి

రామగిరిలో ఎన్టీఆర్, రవీంద్ర కాంస్య విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

టిడిపి వ్యవస్థాపకులు, మాజీ సిఎం ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. రామగిరిలో ఈ నెల 29వ తేదీ పరిటాల రవి జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అదే రోజు పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాల ఆవిష్కరణ, మెగా రక్తదాన, వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 30వ తేదీ పెనుకొండలో పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ ఆ నియోజకవర్గ టిడిపి నాయకులు వెంకటాపురం గ్రామం వెళ్లి ఎమ్మెల్యే పరిటాల సునీతకు ఆహ్వాన పత్రిక అందజేశారు.

దుకాణాలు తొలగించుకోండి : తహశీల్దార్

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక ధర్మవరం రోడ్డులో మార్కెట్ యార్డ్ కింద ఉన్న దుకాణాలను తొలగించుకోవాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ బాలాంజనేయులు ఆదేశించారు. ఈ రహదారిలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని, కావున ఆర్అండ్‌బి స్థలంలో వేసుకున్న దుకాణాలను రెండు రోజుల్లోపు తొలగించుకోవా లన్నారు. వాటిని తొలగించుకున్న వెంటనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో విఆర్ఎలు శివప్రసాద్, సాయి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి గడువు పొడిగింపు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల రిజిస్ట్రేషన్ గడువును సెప్టెంబర్ 1వ తేదీ వరకూ పొడిగించినట్లు పట్టణంలోని ప్రభుత్వ కెహెచ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కోర్సు, కళాశాల ఎంపికకు సెప్టెంబర్ 2వ తేదీ లోపు వెబ్ ఆప్షన్ నమోదు చేసుకోవాల న్నారు. వెబ్ ఆప్షన్ మార్పునకు 3వ తేదీ, సీట్ల కేటాయింపు 6వ తేదీ జరుగుతుందన్నారను. 8వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి కలిగిన వారు కళాశాలలో సంప్రదించాలన్నారు.

అల్లరిమూకలపై ప్రత్యేక దృష్టి : ఎస్ఐ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

అల్లరిమూకలపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్ఐ వలిబాషా తెలిపారు. ఆయన గురువారం మండలంలోని పెడబల్లి జలాశయాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రతిమలను నిమజ్జనం చేసేందుకు పెడబల్లి జలాశయంలో అనువైన ప్రదేశంగా గుర్తించామన్నారు. చవితి ఉత్సవాలను కుల మతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేకమైన దృష్టి సారించామని, అల్లరి మూకలపై డేగ కన్ను ఉంచామన్నారు. ఎస్ఐ వెంట కానిస్టేబుల్ నాగరాజు, హోం గార్డు మౌలా సాహెబ్ ఉన్నారు.

నిమజ్జనం కోసం చెరువును పరిశీలిస్తున్న ఎస్ఐ

వైసిపి బతుకంతా అబద్ధాలే : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

పింఛన్ల తొలగింపులో అర్హుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం చేయబోమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పష్టం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ అనారోగ్యాలతో బాధపడుతున్న 29 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 20 లక్షల సిఎం సహాయనిధి చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే పట్టణంలోని తన కార్యాలయంలో అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైసిపి బతుకంతా అబద్ధాలే అన్నారు. పింఛన్ల విషయంలో అనవసరంగా లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి పాలనలో అడ్డదారిలో దొంగ పింఛన్లు పొందారని, అలాంటి వారిపై చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వంపై వైసిపి నాయకులు చేసే అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, శంకర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే

అప్పుడే పుట్టిన పిల్లల ఆరోగ్యంపై నిఘా

అగళి : అంగన్వాడీ సిబ్బంది అప్పుడే పుట్టిన పిల్లల ఆరోగ్యంపై నిఘా ఉంచాలని, బాలింతలకు అన్ని విధాలుగా సహకరించాలని సిడిపిఒ నాగమల్లేశ్వరి సూచించారు. స్థానిక అంగన్వాడీ-3 కేంద్రంలో గురువారం భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆరు నెలల క్రితం పుట్టిన ఆడబిడ్డ ఇంటి వద్ద మొక్కలు నాటారు. అనంతరం అంగన్వాడీ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతిరోజూ 9 గంటలకు బయోమెట్రిక్ ఇవ్వాలని, బిడ్డ పుట్టిన తర్వాత రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని ఆదేశించారు. సెక్టార్ మీటింగ్ కూడా ఏర్పాటు చేశారు.

మొక్క నాటుతున్న అంగన్వాడీ సిబ్బంది

వినాయక ఉత్సవ కమిటీలతో సమావేశం

లేపాక్షి : స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఎస్ఐ నరేంద్ర ఆధ్వర్యంలో మండలంలోని వినాయక ఉత్సవ కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రూరల్ సిఐ జనార్దన్ హాజరై పలు సూచనలు చేశారు. మండపాల వద్ద, నిమజ్జనం ఊరేగింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని, పోలీసులకు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ నారాయణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై ప్రజావేదిక

నల్లమాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక సామాజిక తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఉపాధి హామీ పనుల్లో అవినీతి జరిగిందా లేదా అనే విషయాలను వెలుగులేకి తేవాలన్న ఉద్దేశంతో ఈ తనిఖీ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని వినతి

గోరంట్ల : కూటమి ప్రభుత్వం తక్షణమే స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వ్యకాసం ఆధ్వర్యంలో తహశీల్దార్ మారుతికి వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీలతో ప్రజలపై భారం ప్రభుత్వం మోపుతోందని, దీనిని వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున పోరాటం కొనసాగిస్తామన్నారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాలప్ప, అంజలి, వెంకటలక్ష్మమ్మ, ఆంజనేయులు, లోకేష్, నంజుండప్ప, మణి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ మారుతికి వినతి పత్రం ఇస్తున్న వ్యకాసం నాయకులు